PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించాలి


3లో

రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 313 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 06 నవంబర్ 2026

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు

ప్రభుత్వం సిద్ధం!

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం



హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన 38వ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. మూడు బ్యారేజీల ఫౌండేషన్ కటాఫ్ వాల్, డౌన్‌స్ట్రీమ్, కాంక్రీట్ డయాఫ్రం వాల్‌లో లోపాలను జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) గుర్తించి పలు సూచనలు చేసిందని మంత్రి తెలిపారు. ఎన్డీఎస్ఏ సూచించిన పరీక్షలన్నింటినీ నిర్వహించి, వాటి వివరాలను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఎన్డీఎస్ఏకు నివేదించినట్టు చెప్పారు. ఆయా సంస్థల సూచనల మేరకు మూడు బ్యారేజీల మిగతా2లో...

పారా అథ్లెట్ల పోరాటం

దేశానికి స్ఫూర్తి

114 పతకాలతో భారత్ చరిత్రాత్మక ఘనత.. క్రీడాకారులతో ప్రధాని మోదీ ప్రత్యేక భేటీ



న్యూఢిల్లీ,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఆసియా పారా గేమ్స్-2026లో భారత క్రీడాకారులు సాధించిన చారిత్రాత్మక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పారా అథ్లెట్ల పోరాటం, పట్టుదల, అంకితభావం ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తున్నాయని కొనియాడారు. గురువారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పతక విజేతలతో ప్రత్యేకంగా సమావేశమై అభినందించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గతంలో పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకోవడానికి తల్లిదండ్రులు సంకోచించేవారని గుర్తుచేశారు. మిగతా2లో...

ఇందిరమ్మ కుటుంబాలతో

దీపావళి..

ప్రజాప్రతినిధులకు సీఎం పిలుపు

లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో నేనూ భాగస్వామినవుతా..

ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొనాలి: సీఎం రేవంత్‌రెడ్డి


2లో

పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ

గ్లోబల్ సమ్మిట్!

డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ.. ఏర్పాట్లపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష



హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఈ సదస్సు జరగనుందని వెల్లడించారు. గురువారం సచివాలయంలో సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానాలు పంపినట్లు, ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. అంచనాలకు మించి స్పందన వస్తోందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో రక్షణ, పారిశ్రామిక, ఫార్మాలైఫ్ సైన్సెస్ ఎక్స్‌పోలు మిగతా2లో...



ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సీఈఓ సుదర్శన్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్ల సంఘం వినతి

హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఎన్నికల నిర్వహణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి గురువారం తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) చేసిన అదనపు ఖర్చుల మిగతా2లో...

గల్లంతైన 16 మంది

సురక్షితం

- బేతుపల్లి ఘటనపై ఉత్కంఠకు తెర..

అర్ధరాత్రి సాహసోపేత రెస్క్యూ ఆపరేషన్


2లో

అక్రమ కట్టడాలపై

కవిత కన్నెర్ర!

- నెల రోజుల్లో సమగ్ర సర్వే చేపట్టాలి..

లేదంటే పార్టీ తరపున రెడ్‌మార్క్ వేస్తాం



హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఖానామెట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని, అప్పటికీ చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు రెడ్‌మార్క్ వేస్తారని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మిగతా2లో...

కొడంగల్‌లో మూడు రోజుల పాటు

సీఎం రేవంత్ పర్యటన

రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు..

50 వేల మంది రైతులతో భారీ సభ


2లో

ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్..

21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో....


2లో

పారా అథ్లెట్ల పోరాటం దేశానికి స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం క్రీడారంగంలో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవకాశాలను మెరుగుపరుస్తోందన్నారు. యువత కలలు, ప్రతిభ వృథా కాకుండా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు.ఆసియా పారా గేమ్స్‌లో తొలిసారిగా 61 మంది భారత క్రీడాకారులు పాల్గొనడం విశేషమని మోదీ పేర్కొన్నారు. రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి, దృష్టిలోపాన్ని అధిగమించి అద్భుత ప్రదర్శన చేసిన అథ్లెట్ సిమ్రన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుత విజయాలతో ఆగిపోకుండా 2028 లాస్ ఏంజెలెస్ పారాలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జపాన్‌లోని ఐచి-నగోయాలో ఇటీవల ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో భారత్ మొత్తం 114 పతకాలు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. గతంలో భారత్ సాధించిన 108 పతకాల రికార్డును అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. ఈ విజయాల్లో 97 మంది భారత పారా అథ్లెట్లు భాగస్వాములయ్యారు.

ఇందిరమ్మ కుటుంబాలతో దీపావళి..

హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): పేదల సొంతింటి కల సాకారమైన వేళ ఈ దీపావళి పండుగను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. పేదల సొంతింటి సంతోషంలో తాను కూడా భాగస్వామిని కానున్నానని పేర్కొన్నారు.ఈ దీపావళికి తాను ఒక ఇందిరమ్మ ఇంటికి వెళ్లి లబ్ధిదారుల కుటుంబంతో కలిసి పండుగ జరుపుకోనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు కూడా తమ ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని కోరారు. పేద కుటుంబాల ఆనందంలో పాలుపంచుకుంటూ వారి ఇళ్లలో దీపాలు వెలిగించాలని సూచించారు.రాష్ట్రంలో తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే 2,21,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పేదలకు సొంతింటి భద్రత, ఆత్మగౌరవం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలు నిర్వహించాలన్న సీఎం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. యువ పారిశ్రామికవేత్తలు, జెన్-జీ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, విద్యా సదస్సుతో పాటు ఏరోబాటిక్ ఎయిర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.ఇప్పటికే హైదరాబాద్, ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని సంజయ్ జాజు తెలిపారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగంగా ప్రపంచ పారిశ్రామికవేత్తలను రాష్ట్రంలో పెట్టుబడులకు ఆకర్షించడమే సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎన్నికల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేటాయించిన బడ్జెట్ సరిపోకపోవడంతో అధికారులు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని లచ్చిరెడ్డి వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం కొందరు అధికారులు అప్పులు చేసి ఖర్చులు భరించారని, ఇప్పటికీ ఆ మొత్తాలు తిరిగి అందలేదని తెలిపారు.

బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా అప్పులు ఇచ్చినవారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, కొందరు రుణదాతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కార్యాలయాలు, నివాసాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వల్ల వారి గౌరవానికి భంగం కలుగుతోందన్నారు.నాంపల్లి అసెంబ్లీ, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించిన అదనపు వ్యయ ప్రతిపాదనలు సహా వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి నిధులు విడుదల చేయాలని సంఘం కోరింది.

అక్రమ కట్టడాలపై కవిత కన్నెర్ర!

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన కవిత.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో గురుకుల ట్రస్టుకు చెందిన భూముల్లో 500 నుంచి 700 వరకు అక్రమ నిర్మాణాలు వెలిశాయని ఆరోపించారు. మరో 80 భవనాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రిజిస్ట్రేషన్లు సాధ్యం కాని భూముల్లో నోటరీల ద్వారా లావాదేవీలు జరుపుతున్నారని, పది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని కవిత ఆరోపించారు. వాటిలో పీజీ హాస్టళ్లు, కళాశాలలు నిర్వహిస్తున్నారని, కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.అక్రమ నిర్మాణాలపై వార్తలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను భవన యజమానులు బెదిరిస్తున్నారని కవిత ఆరోపించారు. అయ్యప్ప సొసైటీలో సమగ్ర సర్వే నిర్వహించి, అనుమతులు లేని నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు అక్కడి భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పోలీసులపై ఫిర్యాదులేవీ అందలేదు!

- జులై 20న జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టుకు ఉన్నత స్థాయి కమిటీ నివేదిక



న్యూఢిల్లీ,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు అరాచకత్వానికి పాల్పడ్డారంటూ భౌతికంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఉన్నత స్థాయి విచారణ కమిటీ (హెచ్‌పీఈసీ) వెల్లడించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్టోబర్ 31న సమర్పించిన చర్యల నివేదికలో ఈ విషయం పేర్కొన్నట్లు గురువారం కోర్టు వెల్లడించింది.పోలీసుల చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్పులు, ఇతర ఆధారాలను కమిటీ పరిశీలనకు సమర్పించేందుకు పిటిషనర్లకు కోర్టు అవకాశం కల్పించింది. ఫిర్యాదులను అజ్ఞాతంగా నమోదు చేసేందుకు కమిటీ ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించింది. నిరసనల సందర్భంగా పోలీసులు ఉపయోగించిన మందుగుండు సామగ్రి వివరాలను సమర్పించకపోవడంపై పిటిషనర్లు ప్రశ్నించారు.అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి జాప్యం లేకుండా నివేదికలు ఇవ్వాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. నెల రోజుల్లో తొలి నిజ నిర్ధారణ నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఫిర్యాదుల కోసం నిరవధికంగా వేచి ఉండలేమని పేర్కొంటూ, ఈ కేసుపై డిసెంబర్‌లో మరోసారి విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

మరమ్మతులను త్వరలోనే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026కు సంబంధించి సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ఇతర రంగాల్లో విధానాలను సరళీకృతం చేయడం ద్వారా ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ ముందుకెళ్తోందన్నారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 2.25 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. ఈ నేపథ్యంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి గ్రామ సర్పంచ్ వరకు ప్రజాప్రతినిధులంతా తమ పరిధిలోని ఒక ఇందిరమ్మ ఇంట్లో జరిగే దీపావళి వేడుకల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి కొడంగల్‌లో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారని, మంత్రులందరూ పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు.మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి వార్డు, గ్రామపంచాయతీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దీనితో పాటు రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల కోసం వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

అలాగే రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో రెవెన్యూ శాఖకు చెందిన భూములను అవసరాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

గల్లంతైన 16 మంది సురక్షితం

సత్తుపల్లి, నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్దచెరువు వద్ద బుధవారం సాయంత్రం మొదలైన ఉత్కంఠ చివరకు సుఖాంతమైంది. చెరువులో చిక్కుకున్న ఎనిమిది మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్డీఆర్ఎఫ్ బృందం పడవ బోల్తా పడటంతో మత్స్యకారులతో పాటు సహాయక సిబ్బంది కూడా చెరువులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. చీకటిని సైతం లెక్కచేయకుండా మొత్తం 16 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాయి.రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఘటన జరిగినప్పటి నుంచి కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాత్రంతా చెరువు వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు అందించారు. రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి కృషిని, జిల్లా అధికారుల పనితీరును ప్రశంసిస్తూ రెస్క్యూ బృందాలకు ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

కొడంగల్‌లో మూడు రోజుల పాటు సీఎం రేవంత్ పర్యటన

హైదరాబాద్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించడంతో పాటు రూ.9,053.48 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అలాగే రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ నెల 7న హకీంపేటలో మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభిస్తారు. రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారు.

పారిశ్రామికవేత్తలతోనూ సమావేశం కానున్నారు.8న స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ.5,060 కోట్ల రేడియల్ రోడ్డు, రూ.2,100 కోట్ల ఎత్తిపోతల పథకం రెండో దశ, రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, ఆధునిక బస్టాండ్లు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు.

పూర్తయిన పాఠశాలలు, కళాశాలలు, పోలీస్ స్టేషన్లు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలను కూడా ప్రారంభిస్తారు.పర్యటన చివరి రోజైన 9న హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఈ సభకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శన వద్ద ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

ముగిసిన పరిషత్ ఎన్నికల పోలింగ్.. 7న ఓట్ల లెక్కింపు!

- చెదురుమదురు ఘటనల మధ్య ముగిసిన ఓటింగ్.. 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో



అమరావతి, నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్నవారికి కూడా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సుమారు 21,012 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 65 నుంచి 68 శాతం వరకు ఓటింగ్ నమోదై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మధ్యాహ్నం 1 గంటకు 30.50 శాతంగా ఉన్న పోలింగ్.. ఆ తర్వాత వేగం పుంజుకుంది. రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలుపోలింగ్ సందర్భంగా పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో రాజకీయ పార్టీలకు చెందిన వర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. కొన్ని చోట్ల కర్రలు, రాళ్లతో దాడులకు పాల్పడినట్లు సమాచారం. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ, పోలింగ్ ప్రక్రియ పెద్దగా అంతరాయం లేకుండా ముగిసింది.పోలింగ్ పూర్తయిన వెంటనే అధికారులు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేశారు. వాటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తోంది. ఎక్కడైనా తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది.నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. అనంతరం నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో పరిషత్ ఎన్నికల తుది ఫలితాలపై రాజకీయ పార్టీలతో పాటు అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.

ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు

● ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు అదనపు సమయం



న్యూఢిల్లీ,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, నాగాలాండ్‌తో పాటు ఢిల్లీలో ఈ ప్రక్రియకు సంబంధించిన గడువులను పొడిగించింది. తెలంగాణలో ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి నవంబర్ 26 వరకు గడువు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్, హర్యానాలో నవంబర్ 20 వరకు, నాగాలాండ్‌లో నవంబర్ 25 వరకు గడువు పొడిగించింది. మహారాష్ట్రలో అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణను డిసెంబర్ 13 వరకు కొనసాగించనున్నారు. ఈ రాష్ట్రాల్లో తుది ఓటరు జాబితాలను నవంబర్ 30న ప్రకటించనున్నారు.ఢిల్లీలో అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 25 వరకు పొడిగించగా, తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారందరికీ అవకాశం కల్పించడంతో పాటు అభ్యంతరాలను పరిష్కరించేందుకు ఈ గడువు పొడిగింపు చేపట్టినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించాలి

పీఎం రహత్, రహ్‌వీర్ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

ప్రమాద సమయంలో వెంటనే స్పందించి ప్రాణాలు కాపాడాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్):రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే స్పందించి బాధితులకు సాయం అందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. సకాలంలో వైద్యం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని, ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కరీంనగర్ కలెక్టరేట్‌లో గురువారం పీఎం రహత్, రహ్‌వీర్ పథకాల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అత్యవసర సమయంలో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్ సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.**రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం**పీఎం రహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తారని కలెక్టర్ వివరించారు. బాధితుల ఆర్థిక పరిస్థితితో సంబంధం లేకుండా సకాలంలో నాణ్యమైన వైద్యం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు.**సాయం చేసిన వారికి రూ.25 వేల ప్రోత్సాహకం**ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి రహ్‌వీర్ పథకం కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తారని తెలిపారు. సాయం చేసేవారికి చట్టపరమైన రక్షణ కల్పించడంతోపాటు వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు. **రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత** హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, వేగ పరిమితులు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని కలెక్టర్ సూచించారు. హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారం అందించే పథకం అమల్లో ఉందని తెలిపారు. అర్హులైన బాధితులు ఈ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ-డీఏఆర్ విధానంలో ప్రమాద వివరాలను డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల విచారణ, పరిహారం, రహదారి భద్రతా చర్యలు మెరుగుపడతాయని వివరించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, డీటీఓ జైపాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజగోపాల్‌రావు, ఏసీపీ శ్రీనివాస్ జీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- వర్షానికి ధాన్యం తడవకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..



కరీంనగర్,నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): వానాకాలం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమయ్యేలా చూడాలని సూచించారు. గురువారం రాత్రి కరీంనగర్ ఐడీఓసీలో పౌరసరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం తరలింపు, రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా** ప్రణాళిక ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు కూడా కొనుగోళ్ల ప్రక్రియలో అధికారులకు, రైతులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.**వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడాలి** కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన ఇతర వసతులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.కటింగ్ పేరిట రైతులకు ఎలాంటి ఇబ్బందులు సృష్టించవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రజనీకాంత్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రావుతో పాటు పలువురు అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్

బేతుపల్లి చెరువు వరద ఉధృతిలో చిక్కుకున్న 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించిన సహాయక బృందాలు

ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూర్తి, సమర్థవంతమైన పర్యవేక్షణతో విజయవంతమైన సహాయక చర్యలు







సత్తుపల్లి, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో వరద ఉధృతిలో చిక్కుకున్న 9 మంది మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది బోట్లు వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. ఈ ఘటనలో 10 మంది ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, 9 మంది మత్స్యకారులు ప్రమాదంలో చిక్కుకున్నారు.సమాచారం అందుకున్న వెంటనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమయస్ఫూర్తితో అదనపు సహాయక బృందాలను రంగంలోకి దించి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి వరద ఉధృతిలో చిక్కుకున్న వారందరినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు.జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యల పురోగతిని తెలుసుకుని, అవసరమైన సూచనలు చేస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందరూ సురక్షితంగా బయటపడటంతో పోలీసు శాఖ, ప్రభుత్వ యంత్రాంగం, వారి కుటుంబ సభ్యులు ఊరట చెందారు. ఈ సందర్భంగా సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీసు, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.ప్రాణాలను కాపాడడంలో పోలీసు శాఖ చూపిన చొరవ, ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్, కలెక్టర్ దివాకర్ టిఎస్ సమయస్ఫూర్తితో కూడిన పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయంతో సహాయక చర్యలు విజయవంతంగా ముగిసాయి.



బేతుపల్లి చెరువు బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన





సత్తుపల్లి, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):బేతుపల్లి పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి వరద ఉధృతిలో చిక్కుకున్న మత్స్యకారులు, వారిని రక్షించేందుకు వెళ్లిన ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, పర్వతనేని వేణు తదితరులు పాల్గొన్నారు.

మల్లంపల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- మంత్రి సీతక్క చొరవతో రూ.32.41 కోట్లతో 689 పనులు



జేడీ మల్లంపల్లి, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పాటైన జేడీ మల్లంపల్లి మండల అభివృద్ధికి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ప్రత్యేక చొరవ చూపుతున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు కుసుమ సునీత తెలిపారు. ప్రజల దశాబ్దాల ఆకాంక్ష మేరకు మండల ఏర్పాటు చేయడంతోపాటు దివంగత మాజీ జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ పేరును పెట్టడం అభినందనీయమన్నారు.జిల్లాలో రూ.32.41 కోట్లతో 689 అభివృద్ధి పనులు చేపడుతుండగా, మల్లంపల్లి మండలంలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మార్కెట్లు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు.తాగునీటి సమస్య పరిష్కారానికి రామప్ప నీటిని శుద్ధి చేసి మల్లంపల్లితోపాటు ఇతర మండలాలకు అందించే చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాంచంద్రాపురం ప్రజాదర్బార్‌లో 10,600 ఎకరాల భూముల పట్టాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మంత్రి సీతక్క చొరవతో మండలం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని కుసుమ సునీత పేర్కొన్నారు.

పంట నష్టం సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలి

- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య






కల్లూరు, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):మురుసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కల్లూరు మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరిశీలించారు. చండ్రుపట్ల తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కోత దశకు చేరుకున్న వరి పంటలు నీట మునిగి, నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, పత్తి పంట కూడా దెబ్బతిన్నదని ఆయన అన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐయూఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్‌కు ఘన సన్మానం

- ముఖ్య కార్యకర్తల సమావేశానికి టీఎంహెచ్‌డీ నాయకుల సంఘీభావం



ఖమ్మం, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్‌ను తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ గురువారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.ఖమ్మంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఐయూఎంఎల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి టీఎంహెచ్‌డీ నాయకులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రజాస్వామ్య పద్ధతిలో కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో టీఎంహెచ్‌డీ జిల్లా నాయకులు బొడ్డు గురవయ్య, మునగలేటి వీరస్వామి, పిల్లిగుండ్ల ముత్తయ్య, కృష్ణమురళి, మధు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు అండగా సంద్ర వెంకటవీరయ్య

- కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించి బాధితులకు భరోసా
- వరద నష్టంపై ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి





సత్తుపల్లి, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :మురుసు తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు సత్తుపల్లి పట్టణంలోని కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వరద నీటిలో మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య పరామర్శించారు. కాలనీలోని కింద అంతస్తుల్లో నివసిస్తున్న 32 మంది వరద ప్రభావానికి గురికావడంతో గురువారం ఆయన కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ఇంట్లోని సామగ్రి, నిత్యావసర వస్తువులు దెబ్బతిన్నాయని బాధితులు సంద్రకు వివరించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆపద సమయంలో అధైర్యపడవద్దని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని సంద్ర వెంకటవీరయ్య భరోసా కల్పించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.


ఉద్యమకారుల హక్కులపై కాలయాపన తగదు

- కేశవరావు కమిటీ తక్షణమే నిర్ణయం తీసుకోవాలి:



జవహర్ నగర్, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):

తెలంగాణ ఉద్యమకారులకు గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న హక్కులు, హామీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం కూడా కాలయాపన చేయడం తగదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, ఆరోగ్య కార్డులు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందించాల్సిన హక్కులు, సంక్షేమ ప్రయోజనాలను అమలు చేయలేదని నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఈ హామీలను నెరవేరుస్తామని ప్రకటించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తర్వాత కమిటీ ఏర్పాటు చేసి సమస్యను మరింత జాప్యం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేశవరావు కమిటీ తక్షణమే నిర్ణయం తీసుకుని ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో త్యాగాలు చేసి, అనేక పోరాటాల్లో పాల్గొన్నారని, ఆ క్రమంలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడితే తమ జీవితాలు మెరుగుపడతాయని ఆశించిన వారికి ఇప్పటికీ న్యాయం జరగకపోవడం నిరాశకు గురిచేస్తోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అనే రాజకీయ భేదాలు పక్కనపెట్టి అన్ని పార్టీల నాయకులు సమిష్టిగా ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి న్యాయపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ మృతిపట్ల ఫోరం నాయకులు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇలాంటి విషాదకర ఘటనలు ఉద్యమకారుల కుటుంబాలను తీవ్రంగా కలచివేస్తాయని పేర్కొన్నారు. మరెవరూ ఇలాంటి బాధాకరమైన నిర్ణయాలకు వెళ్లకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు బండకింది సింగరయ్య గౌడ్, కార్యదర్శి



కళ్ళకు చంద్రన్న ప్రసాద్, కుమ్మరి నరసింహ తదితర నాయకులు పాల్గొన్నారు.జోహార్ వేముల లక్ష్మణ్ గౌడ్‌కు ఉద్యమకారుల నివాళి అర్పించారు.

హనుమా తండా శ్మశానవాటికకు విద్యుత్ సదుపాయం

- మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ చొరవతో సమస్య పరిష్కారం



కల్లూరు, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్): కల్లూరు మున్సిపాలిటీ ఏడో వార్డు హనుమా తండా శ్మశానవాటికకు ఎట్టకేలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు నూతన విద్యుత్ లైన్ మంజూరైంది. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ ప్రత్యేక చొరవతో ఏళ్లనాటి సమస్య పరిష్కారమైంది.శ్మశానవాటికలో విద్యుత్ సదుపాయం లేక రాత్రి వేళల్లో అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి చైర్మన్ తీసుకెళ్లారు. వారి సహకారంతో విద్యుత్ లైన్ మంజూరైంది.సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్‌కు హనుమా తండా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిరాహార దీక్షకు అహ్మద్ పాష మద్దతు

కరీంనగర్, నవంబర్ 05(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల ముస్లిం వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష శిబిరానికి దూదేకుల రాష్ట్ర యువత అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు అహ్మద్ పాష మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని



సందర్శించిన ఆయన, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సంచార జాతుల ముస్లిం వెనుకబడిన తరగతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

- చికిత్స పొందుతూ మృతి.. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

కల్లూరు, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కల్లూరు మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన మర్సకట్ల శేఖర్ దుర్వ్యసనాలకు బానిసై ఇంట్లోని డబ్బులను దుబారా ఖర్చు చేస్తున్నాడని తెలుస్తోంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. గత నెల 23వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన శేఖర్ ఆవేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయితే, పరిస్థితి విషమించడంతో నవంబర్ 5వ తేదీ అర్ధరాత్రి 12.30 గంటలకు చికిత్స పొందుతూ శేఖర్ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మర్సకట్ల రాణి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

ఉద్యమకారుల గుర్తింపులో జాప్యం తగదు

ప్రభుత్వం వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించాలి: రేండ్ల సంతోష్

మంగపేట మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



మంగపేట, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి అర్హులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు రేండ్ల సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం మంగపేటలో పప్పు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు ప్రక్రియలో జాప్యం వల్ల ఉద్యమకారులు నిరాశకు గురవుతున్నారని, సంఘాలు వేరైనా అందరి లక్ష్యం ఉద్యమకారులకు న్యాయం చేయడమేనని అన్నారు. మలిదశ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా మంగపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పప్పు వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా చీకుర్తి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మార్పుల వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చన్నపెల్లి వెంకన్న, సహాయ కార్యదర్శిగా వీర్ల రఘునాథ్, కోశాధికారిగా వీరభద్రాచారి ఎన్నికయ్యారు. మైనారిటీ అధ్యక్షుడిగా గఫార్ ఖాన్, మహిళా అధ్యక్షురాలిగా కాటూరి సుగుణ తో పాటు పలువురిని సలహాదారులుగా నియమిం చారు.సమావేశంలో ఐక్యవేదిక జిల్లా, మండల నాయకులు, సీనియర్ ఉద్యమకారులు పాల్గొన్నారు.

సంచార ముస్లింల నిరాహార దీక్షకు జమాతే ఇస్లామీ హింద్ మద్దతు

- ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్, ఏటా రూ.1,000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్



కరీంనగర్, నవంబర్ 5 (పిసిడబ్ల్యూ న్యూస్):కరీంనగర్ కలెక్టరేట్ వద్ద తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు నిరాహార దీక్షకు జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. బీసీ-ఈ కేటగిరీలోని 14 సంచార, వెనుకబడిన ముస్లిం ఉపకులాల ప్రతినిధులు ఈ దీక్షలో పాల్గొన్నారు.సంచార ముస్లింల కోసం ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఏటా రూ.1,000 కోట్లు కేటాయించాలని, పేద విద్యార్థులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో స్కాలర్‌షిప్ పథకం ప్రవేశపెట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.దీక్షా శిబిరాన్ని సందర్శించిన జమాతే ఇస్లామీ హింద్ నాయకులు సంచార ముస్లింల డిమాండ్లకు మద్దతు తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని సిటీ అధ్యక్షుడు సొహైబ్ అహ్మద్ ఖాన్ హామీ ఇచ్చారు.

ఏటూరునాగారంలో జూనియర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి



- హైకోర్టు న్యాయమూర్తులకు వినతిపత్రం అందజేసిన కోర్టు సాధన సమితి సభ్యులు

ఏటూరునాగారం, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ న్యూస్):ములుగు జిల్లాకు నూతనంగా మంజూరైన జూనియర్ ఫాస్ట్‌ట్రాక్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏటూరునాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ ఏటూరునాగారం తాలూకా కోర్టు సాధన సమితి సభ్యులు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ



సందర్భంగా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌లను కలిసి ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. న్యాయమూర్తులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి అనంతరం వినతిపత్రాలు సమర్పించారు. ఏటూరునాగారం తాలూకా పరిధిలోని మారుమూల గ్రామాల ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కావాలంటే స్థానికంగా కోర్టు ఏర్పాటు అవసరమని సమితి సభ్యులు పేర్కొన్నారు. కోర్టు ఏర్పాటైతే ప్రజలకు ప్రయాణ భారం, సమయం ఆదా కావడంతో పాటు న్యాయసేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు సాధన సమితి అధ్యక్షుడు అడ్వకేట్ దాగం ఆదినారాయణ, సీనియర్ న్యాయవాది వేణుగోపాలాచారి, ఉపాధ్యక్షుడు ప్రణయ్ ప్రసాద్, కమిటీ సభ్యులు ఏలూరి రవి, ప్రసాద్ రెడ్డి, పూర్ణచందర్ రావు, నారపోగు రాంబాబు, కిరణ్ కుమార్ వర్మ, సీతారామ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సాగునీరు అందక పంటలు పండించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, క్రాప్ హాలిడే ప్రకటించిన నేపథ్యంలో రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు.







వృథాగా గోదావరిలో కలుస్తున్న నీటిని వినియోగించి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో గుండె బాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తౌటం రూన్సీరాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు పేరాల సంపత్‌రావు, ఐకేపీ ఏపీఎం లలితాదేవి, సర్పంచులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినికి ఘన సన్మానం

- ప్రేరణ కార్యక్రమం2026లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం



ములుగు, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):ప్రేరణ కార్యక్రమం 2026లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని జిల్లా కలెక్టర్ ఘనంగా అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన ప్రేరణ కార్యక్రమం2026లో పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష మరియు ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఎంపిక చేశారు.దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ములుగు జిల్లాకు చెందిన విద్యార్థిని ప్రతిభ చాటింది. అక్టోబర్ నెలలో నిర్వహించిన వారం రోజుల ప్రేరణ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృత్తి నైపుణ్యాలు, సమయపాలన, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు.విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి అభినందించిన జిల్లా కలెక్టర్, ఆమెకు ప్రశంసాపత్రాన్ని అందజేసి భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు.. సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు ప్రారంభించిన మంత్రి సీతక్క

ఏటూరునాగారం, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించి,





వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లను మంత్రి ప్రారంభించారు. గురుకులాలు, గిరిజన సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు 1800-425-3369 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి, +91 9493368361 వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి

- యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి: మంత్రి సీతక్క



ఏటూరునాగారం, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):యువత స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని మంత్రి సీతక్క సూచించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేసేలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏటూరునాగారంలోని గిరిజన భవనం, వైటీసీ, పోలీస్ శిక్షణ కేంద్రాలను మంత్రి సందర్శించారు. కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడి వారి శిక్షణ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర సాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. అపజయాలకు భయపడకుండా వాటిని విజయానికి మెట్లుగా భావించాలని సూచించారు.గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువత ఉద్యోగాల్లో రాణించి కుటుంబానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం

- ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు.. లేకుంటే ఒంటరి పోటీ: ఐయూఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):ప్రజా సమస్యల పరిష్కారమే ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ మహమ్మద్ షకీల్ తెలిపారు. గురువారం ఖమ్మంలోని రెస్టిన్ హోటల్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. బాజీబాబా అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, మత సామరస్యం, పేదలు, వెనుకబడిన వర్గాల హక్కుల సాధన కోసం పార్టీ నిరంతరం



పోరాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఐయూఎంఎల్‌ను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని అన్నారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, కార్పొరేషన్ ఎన్నికలపై రాష్ట్ర జాతీయ నాయకత్వం నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని తెలిపారు.ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు కుదిరితే కలిసి, లేకుంటే ఒంటరిగా పోటీ చేస్తామని జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. బాజీబాబా వెల్లడించారు. తమ పార్టీ తరఫున 15 డివిజన్లలో అభ్యర్థులను నిలబెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని,

ఖమ్మంలో ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీ అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు, మహిళా, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవనవ్యయాలకు అనుగుణంగా దినసరి వేతనాల సవరణ



ములుగు జిల్లా, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):దినసరి వేతన ఉద్యోగుల సంక్షేమం, పెరుగుతున్న జీవనవ్యయాలకు అనుగుణంగా న్యాయమైన వేతనాలు నిర్ణయించే అంశంపై జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులతో చర్చించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో 202627 షెడ్యూల్ ఆఫ్ రేట్స్ ఆధారంగా వేతనాల సవరణ, పెంపుదల ప్రతిపాదనలను పరిశీలించారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయాలు తీసుకునే అంశంపై సమీక్షించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలుగుమట్ల పేదలకు న్యాయం చేయాలి

- కూల్చిన చోటే ఇళ్లు నిర్మించాలి.. మిగిలిన 418 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలి: జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):వెలుగుమట్ల భూదాన భూమిలో ఇళ్లు కోల్పోయిన పేదలందరికీ అదే ప్రాంతంలో తిరిగి నివాసాలు కల్పించాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. 729 కుటుంబాల ఇళ్లను కూల్చివేయగా, ఇప్పటికే 311 ఇళ్లకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో మిగిలిన 418 కుటుంబాలకు కూడా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. నవంబర్ 29లోగా స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేసి, రాహుల్ గాంధీ నివాసం వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.గురువారం ఖమ్మంలోని టిటిడిసిలో కేతవరపు కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇల్లు పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవంతో కూడిన జీవనాధారమని పేర్కొన్నారు. సుమారు 20 ఏళ్లుగా పట్టాలు పొంది నివసిస్తున్న వారి ఇళ్లను కూల్చివేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ



భూముల ఆక్రమణలపై కూడా నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు మాట్లాడుతూ మిగిలిన 418 కుటుంబాలకు న్యాయం చేయాలని, అవసరమైతే ఖమ్మం నుంచి ముఖ్యమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేపడతామని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు, బహుజన నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఘాట్ల మరమ్మతులు, కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: కలెక్టర్



ములుగు జిల్లా, నవంబర్ 5 (పి.సి.డబ్ల్యూ. న్యూస్):గోదావరి పుష్కరాలు2027ను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి పుష్కర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.మంగపేట, చుంచుపల్లి, రామన్నగూడెం ఘాట్లను మూడు దశల్లో సిద్ధం చేయాలని సూచించారు. ఘాట్ల వద్ద మరమ్మతులు, నూతన నిర్మాణాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఘాట్లకు అనుసంధాన రహదారుల అభివృద్ధి, అవసరమైన భూసేకరణపై దృష్టి సారించాలని తెలిపారు. భక్తుల రవాణా, పార్కింగ్, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, భద్రతా ఏర్పాట్లకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతిపాదనలు సకాలంలో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, ఎం. సంపత్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఓటరు జాబితాల సవరణపై కాంగ్రెస్ - బీజేపీ సమరం!

ఎస్ఐఆర్ చుట్టూ ముదురుతున్న రాజకీయ వివాదం.. ఓటు హక్కుకు ముప్పు అంటున్న విపక్షాలు.. అక్రమ ఓట్ల తొలగింపునకు అడ్డుకట్ట వేయాలంటున్న బీజేపీ.. ఎన్నికల సంఘం పారదర్శకతపై దేశవ్యాప్తంగా చర్చ



భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అలాంటి ఓటు హక్కుకు సంబంధించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారాన్ని రేపుతోంది. ఓటరు జాబితాలను ప్రక్షాళన చేయడం ద్వారా నకిలీ, మరణించిన, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లను తొలగించాలన్నది ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రక్రియ ఉద్దేశం. అయితే ఈ ప్రక్రియ అమలులో పారదర్శకత లోపిస్తోందని, అర్హులైన ఓటర్ల పేర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ఓటరు జాబితాల ప్రక్షాళనను వ్యతిరేకించడం ద్వారా అక్రమ ఓట్లకు విపక్షాలు మద్దతు ఇస్తున్నాయని బీజేపీ విమర్శిస్తోంది. దీంతో ఓటరు జాబితాల సవరణ అంశం పరిపాలనా ప్రక్రియ నుంచి రాజకీయ పార్టీల మధ్య ప్రధాన పోరాటంగా మారింది. **ఓటరు జాబితాల సవరణపై రాజకీయ రగడ.. కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ** ఎస్ఐఆర్‌పై ఆరోపణలు, ప్రత్యారోపణలు.. ఢిల్లీలో కాంగ్రెస్ కూటమి, హైదరాబాద్‌లో బీజేపీ బలప్రదర్శన.. ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు.. ప్రసంగాలు కాదు, ఆచరణలోనే నిజాయితీ నిరూపించుకోవాలంటున్న ప్రజలుభారత ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ఓటు హక్కు అత్యంత కీలకమైన అంశాలు. ప్రజలు తమ పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. అలాంటి ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఇప్పుడు దేశ రాజకీయాల్లో పెను వివాదానికి కేంద్రబిందువుగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఓటరు జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తుండగా, బీజేపీ మాత్రం అక్రమ ఓట్లు, నకిలీ ఓటర్లను తొలగించడాన్ని వ్యతిరేకించడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శిస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు, నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ భారీ ర్యాలీలు నిర్వహించాయి. అయితే ఈ ప్రదర్శనల వల్ల ప్రజలకు కొత్తగా తెలిసిన విషయాలేమిటి? సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు చూపిస్తున్న చిత్తశుద్ధి ఎంత? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. **ర్యాలీలతో సమస్యకు పరిష్కారం లభిస్తుందా?** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రతిపక్షాల బాధ్యత. అదే సమయంలో అధికారంలో ఉన్న పార్టీలు విమర్శలకు సమాధానం చెప్పాలి. కానీ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, భారీ ర్యాలీలు నిర్వహించడం, ప్రత్యర్థులను దూషించడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదు. ఢిల్లీలో 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్' నినాదంతో కాంగ్రెస్ కూటమి నిరసన తెలపగా, హైదరాబాద్‌లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకత్వాన్ని తరిమికొట్టండి' అంటూ బీజేపీ సభ నిర్వహించింది. రెండు పార్టీలూ తమ వాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాయి. అయితే ర్యాలీల వల్ల నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు, ప్రజలకు అసౌకర్యం తప్ప అసలు సమస్యపై స్పష్టత ఎంతవరకు వచ్చిందన్నది ఆలోచించాల్సిన విషయం. ప్రజలకు కావాల్సింది రాజకీయ నాయకుల ప్రసంగాలు కాదు.. తమ ఓటు హక్కుకు భరోసా. **13 కోట్ల ఓట్ల తొలగింపు.. నిజానిజాలు తేలాలి** దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించారన్నది విపక్షాల ప్రధాన ఆరోపణ. అయితే తొలగించిన ఓట్లన్నీ అర్హులైన భారత పౌరులవే అని భావించడం సరికాదు. మరణించిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నవారు, అర్హత లేని వ్యక్తుల పేర్లు కూడా ఓటరు జాబితాల్లో ఉండే అవకాశం ఉంది. అలాంటి పేర్లను తొలగించడం ఎన్నికల ప్రక్రియలో అవసరమైన చర్యే. అయితే ఆ పేర్ల తొలగింపు పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును కూడా తొలగిస్తే అది తీవ్రమైన తప్పిదం అవుతుంది. ముఖ్యంగా చిన్నచిన్న సాంకేతిక కారణాలు చూపి, సరైన విచారణ లేకుండా ఓటర్ల పేర్లు తొలగించారనే ఆరోపణలు వస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. తొలగించిన మొత్తం పేర్లలో ఎంతమంది అనర్హులు? ఎంతమంది అర్హులైన ఓటర్లు? ఏ కారణాలతో పేర్లు తొలగించారు? అనే వివరాలను ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించాలి. అప్పుడే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడుతుంది. **ఎన్నికల సంఘం బాధ్యత ఏమిటి?** ఎన్నికల నిర్వహణలో భారత ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం దాని ప్రాథమిక బాధ్యత. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర విపక్షాలు నిర్దిష్టమైన ఆరోపణలు చేస్తున్నప్పుడు వాటికి ఎన్నికల సంఘమే స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించడం కంటే, ఆ సంస్థ తనంతట తానుగా ప్రజలకు వివరణ ఇవ్వడం ముఖ్యం. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతపై ప్రజలకు ఎలాంటి సందేహాలు రాకుండా వ్యవహరించాల్సిన బాధ్యత వాటిపై ఉంది. ఎన్నికల సంఘం నిర్ణయాలు నిష్పక్షపాతంగా ఉన్నాయని ప్రజలు నమ్మినప్పుడే ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం బలపడుతుంది. విమర్శలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ నాయకులు ఎదురుదాడికి దిగడం కంటే, వాస్తవాలను వెల్లడించడం ద్వారా అనుమానాలను నివృత్తి చేయడం సముచితం. **సుప్రీంకోర్టు జోక్యం.. అర్హులైన ఓటర్లకు న్యాయం జరగాలి** ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివాదం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లింది. అర్హులైన ఓటర్లు తమ పేర్లు జాబితాల నుంచి తొలగిపోయాయని భావిస్తే, అలాంటి వారిని గుర్తించి న్యాయస్థానం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కేవలం రాజకీయ వేదికలపై ఆరోపణలు చేయడం వల్ల ఉపయోగం ఉండదు. ఎవరి ఓటు హక్కు తొలగిపోయింది? ఏ కారణంతో తొలగించారు? సంబంధిత వ్యక్తి అర్హత కలిగిన పౌరుడేనా? అధికారుల విచారణలో ఎక్కడ లోపం జరిగింది? వంటి అంశాలకు ఆధారాలు సమర్పించాలి. అర్హులైన ఓటర్లను గుర్తించి న్యాయస్థానం ముందు నిలబెట్టాలని సుప్రీంకోర్టు సూచించిన నేపథ్యంలో కాంగ్రెస్ సహా విపక్షాలు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలి. ఆరోపణలను నిరూపించే బాధ్యతను విస్మరించి కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితమైతే వాటి విశ్వసనీయత దెబ్బతింటుంది.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల చారిత్రక విజయం

ట్రంప్ పాలనకు ప్రజల గట్టి హెచ్చరిక.. రెండు సభల్లోనూ ప్రతిపక్ష ఆధిపత్యం రిపబ్లికన్లకు కోలుకోలేని రాజకీయ ఎదురుదెబ్బ అమెరికా రాజకీయాల్లో కొత్త అధ్యాయం



అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు ప్రపంచ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ప్రజలు గట్టి ఎదురుదెబ్బ ఇవ్వగా, డెమోక్రటిక్ పార్టీ రెండు సభల్లోనూ ఆధిపత్యాన్ని సాధించింది. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ మెజారిటీ దక్కించుకోవడం అమెరికా రాజకీయ చరిత్రలో కీలక పరిణామంగా నిలిచింది. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ఈ ఎన్నికలు ఆయన ప్రభుత్వ విధానాలపై ప్రజల అభిప్రాయాన్ని వెల్లడించాయి. ముఖ్యంగా సంప్రదాయంగా రిపబ్లికన్లకు మద్దతుగా నిలిచే రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఈ ఎన్నికల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.అమెరికా మధ్యంతర ఎన్నికలు కేవలం అధికార పార్టీకి, ప్రతిపక్షానికి మధ్య జరిగే పోటీ మాత్రమే కాదు. అధ్యక్షుడి పాలనపై ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముఖ్యమైన ప్రజాస్వామ్య ప్రక్రియ. అధ్యక్ష ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా? ఆర్థిక పరిస్థితులు ఆశించిన స్థాయిలో ఉన్నాయా? విదేశాంగ విధానాలు దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్నలకు ఓటర్లు తమ ఓటు ద్వారా సమాధానం చెబుతారు. ఈసారి కూడా అదే జరిగింది. ట్రంప్ ప్రభుత్వం అనుసరించిన విధానాలపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. **ఆర్థిక భారమే ప్రధాన కారణమా?** అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం. అయినప్పటికీ అక్కడి సామాన్య ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన వ్యయం, గృహ అద్దెలు, వైద్య ఖర్చులు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాలు, వేతనాలు, కుటుంబాల ఆర్థిక భద్రత వంటి అంశాలు ఎన్నికల్లో కీలకంగా మారాయి. ప్రజల ఆదాయానికి, పెరుగుతున్న ఖర్చులకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రభుత్వంపై అసంతృప్తి సహజంగానే వ్యక్తమవుతుంది. ఆర్థికాభివృద్ధి గణాంకాలు ఎంత గొప్పగా ఉన్నా సామాన్య కుటుంబానికి ఆర్థిక ఉపశమనం లభించకపోతే ఆ అభివృద్ధికి పెద్దగా అర్థం ఉండదు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది.ట్రంప్ ప్రభుత్వం అనుసరించిన దిగుమతి సుంకాల విధానాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. విదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అధిక సుంకాలు విధించడం ద్వారా దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే దిగుమతి ఖర్చులు పెరిగితే వాటి ప్రభావం వస్తువుల ధరలపై పడుతుంది. చివరకు ఆ భారాన్ని వినియోగదారులే భరించాల్సి వస్తుంది. వాణిజ్య యుద్ధాలు అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితిని సృష్టించడమే కాకుండా మిత్రదేశాలతోనూ సంబంధాలపై ప్రభావం చూపుతాయి. అమెరికా వంటి పెద్ద దేశం తీసుకునే ఆర్థిక నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల వాణిజ్య రంగాలపై ప్రభావం చూపుతాయి. **ఇరాన్ యుద్ధం.. ట్రంప్‌కు రాజకీయ సవాలు** ఈ ఎన్నికల్లో మరో ప్రధాన అంశం ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు. యుద్ధం వల్ల ఇంధన సరఫరాలు, చమురు ధరలు, అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. అమెరికా ప్రజలు తమ దేశం ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యలకు పరిష్కారాలు కోరుకుంటున్న సమయంలో విదేశీ యుద్ధాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. యుద్ధానికి వెచ్చించే నిధులు, సైనిక చర్యల వల్ల కలిగే ఆర్థిక భారం, భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై ప్రజల్లో ఆందోళన పెరిగింది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సైతం ఎన్నికల ఓటమికి ఇరాన్ యుద్ధమే కారణమని వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. ట్రంప్ కూడా యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరిగిన విషయాన్ని అంగీకరించారు.ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన సైనిక వ్యవస్థ కలిగిన అమెరికా కూడా యుద్ధాల ఆర్థిక, రాజకీయ ప్రభావాల నుంచి తప్పించుకోలేదనే విషయం ఈ పరిణామాలతో స్పష్టమవుతోంది. సైనిక బలం మాత్రమే దేశ భద్రతకు, ప్రజల సంక్షేమానికి సరిపోదు. దౌత్య చర్చలు, అంతర్జాతీయ సహకారం, శాంతి ప్రయత్నాలు కూడా అంతే ముఖ్యమైనవి. యుద్ధం ప్రారంభించడం సులభమైనా దాని పరిణామాలను నియంత్రించడం చాలా కష్టం. అందువల్ల ఏ దేశమైనా విదేశాంగ విధానాలను రూపొందించేటప్పుడు ప్రజల ప్రయోజనాలను, అంతర్జాతీయ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. **రిపబ్లికన్ల కంచుకోటల్లోనూ మారిన రాజకీయ సమీకరణాలు** ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాల్లోనూ విజయాలు సాధించడం ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అంశం. కాన్సాస్‌లో దశాబ్దాల తర్వాత డెమోక్రటిక్ పార్టీకి సెనేట్ స్థానం దక్కడం, టెక్సాస్‌లోనూ సెనేట్ విజయాన్ని నమోదు చేయడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. సౌత్ కరోలినా సహా పలు రాష్ట్రాల్లో వచ్చిన ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకులో మార్పులు వస్తున్నాయనే చర్చకు కారణమయ్యాయి. ఓటర్లు పార్టీ విధేయతకే పరిమితం కాకుండా తమ రోజువారీ సమస్యలు, అభ్యర్థుల వైఖరి, ప్రభుత్వ పనితీరును కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.యువత, మధ్యతరగతి ప్రజలు, వివిధ సామాజిక వర్గాల ఓటర్లలో వచ్చిన మార్పులు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలు, విద్యా ఖర్చులు, వైద్య సదుపాయాలు, వలస విధానాలు వంటి అంశాలపై రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం భావోద్వేగపూరిత ప్రసంగాలు, రాజకీయ విమర్శలతో ప్రజల మద్దతును నిలబెట్టుకోవడం సాధ్యం కాదనే విషయం ఈ ఎన్నికలు మరోసారి గుర్తుచేశాయి.

ట్రంప్ ప్రభుత్వానికి ఇకపై కాంగ్రెస్ అడ్డుకట్ట

డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ మెజారిటీ సాధించడంతో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రభుత్వ బడ్జెట్, ఆర్థిక కేటాయింపులు, చట్టాల ఆమోదం, వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరుపై కాంగ్రెస్‌కు కీలక అధికారాలు ఉంటాయి. ఈ అధికారాలను ఉపయోగించి ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలను డెమోక్రాట్లు ప్రశ్నించే అవకాశం ఉంది.

స్టార్టప్ ఇంక్యుబేటర్లే భవిష్యత్తు!

ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి యువత ఎదగాలి ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



భారతదేశంలో ఉన్నత విద్య, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐఐటీలు, ఐఐఎంలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలు ఏటా వేలాది మంది పట్టభద్రులను తయారు చేస్తున్నాయి. అయితే వీరిలో ఎంతమంది కొత్త వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు? ఎంతమంది ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నారు? అనే ప్రశ్నలు కీలకంగా మారుతున్నాయి. చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం, అధిక వేతనం, ఉన్నత హోదా కోరుకోవడం సహజమే. కానీ యువత ఉద్యోగార్థులుగానే కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం ఉద్యోగ రంగంలో పోటీ తీవ్రంగా పెరుగుతోంది. ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటి సాంకేతిక మార్పులతో సంప్రదాయ ఉద్యోగాల స్వరూపం మారుతోంది. ఈ పరిస్థితుల్లో యువత కొత్త ఆలోచనలతో వ్యాపారాలను ప్రారంభించి ఉపాధి అవకాశాలను సృష్టించాలి. ఒక స్టార్టప్ విజయవంతమైతే వ్యవస్థాపకుడితో పాటు ఉద్యోగులు, సరఫరాదారులు, సాంకేతిక నిపుణులు, ఇతర సేవా సంస్థలకు కూడా ఉపాధి లభిస్తుంది. చిన్న ఆలోచన కూడా భవిష్యత్తులో పెద్ద పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉంది.అయితే స్టార్టప్ ప్రారంభించడం అంత సులభం కాదు. పెట్టుబడులు, మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. కొన్ని సంస్థలు ప్రారంభ దశలోనే మూతపడుతున్నాయి. ఇలాంటి వైఫల్యాలను ఓటమిగా కాకుండా అనుభవాలుగా స్వీకరించే వాతావరణం ఏర్పడాలి. యువతకు సరైన మార్గదర్శకత్వం, ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయి. **ఇంక్యుబేషన్ కేంద్రాలతో ప్రోత్సాహం** ప్రతి విశ్వవిద్యాలయంలో స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల కొత్త ఆలోచనలను గుర్తించి వాటిని వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించాలి. అనుభవజ్ఞులైన పారిశ్రామికవేత్తలను మార్గదర్శకులుగా నియమించాలి. బ్యాంకులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, ఏంజెల్ ఇన్వెస్టర్లతో విద్యార్థులకు అనుసంధానం కల్పించాలి. కేవలం కార్యాలయాలు, ఇంటర్నెట్ సదుపాయాలకే పరిమితం కాకుండా ఆలోచన నుంచి ఉత్పత్తి తయారీ, మార్కెట్ ప్రవేశం వరకు పూర్తి సహకారం అందించాలి. **గ్రామీణ ప్రాంతాలకూ స్టార్టప్ అవకాశాలు** స్టార్టప్ సంస్కృతి హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాలకే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లోని యువతకు కూడా అవకాశాలు కల్పించాలి. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పరిశ్రమలు వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలి. స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపించే సంస్థలకు పెట్టుబడులు, శిక్షణ అందించాలి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరగడంతో పాటు నగరాలకు వలసలు కూడా తగ్గుతాయి. **తెలంగాణలో విస్తృత అవకాశాలు** స్టార్టప్ రంగంలో తెలంగాణకు ప్రత్యేక అవకాశాలున్నాయి. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన రంగాలకు కేంద్రంగా ఎదిగింది. టీ-హబ్ వంటి సంస్థలు కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహం అందిస్తున్నాయి. ఈ అవకాశాలను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి స్థానిక యువతను ప్రోత్సహించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంచాలి.మొత్తంగా దేశ ఆర్థికాభివృద్ధిలో స్టార్టప్‌ల పాత్ర కీలకంగా మారుతోంది. యువతలోని ప్రతిభను గుర్తించి సరైన పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకత్వం అందించాలి. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కొత్త వ్యాపారాలను స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగేలా విద్యావ్యవస్థలో మార్పులు రావాలి. ప్రతి విశ్వవిద్యా లయంలో ఇంక్యుబేషన్ కేంద్రాలు, ప్రతి జిల్లాలో స్టార్ట ప్‌లకు ప్రోత్సాహక వేదికలు ఏర్పాటైతే యువత ఆలో చనలకు రెక్కలు వస్తాయి. దేశ భవిష్యత్తు అభివృద్ధికి స్టార్టప్ ఇంక్యుబేటర్లే కీలక బాటలు వేయగలవు.



పాక్‌పై భారత్ ఘన విజయం..

చివర్లో ఉత్కంఠ!

- సాఫ్ ఛాంపియన్‌షిప్ ఆరంభ మ్యాచ్‌లో 3-2తో గెలుపు

ఢాకా: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య ఛాంపియన్‌షిప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన భారత ఆటగాళ్లు తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ చేసి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు.మ్యాచ్ 13వ నిమిషంలో సుహైల్ అహ్మద్ భట్ తొలి గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కేవలం ఆరు నిమిషాల వ్యవధిలోనే మరోసారి గోల్ సాధించి స్కోరును 2-0కు చేర్చాడు. 32వ నిమిషంలో మాంగ్లైంతాంగ్ కిప్‌గెన్ మూడో గోల్ చేయడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది.అయితే మ్యాచ్ చివరి నిమిషాల్లో పాకిస్తాన్ ఆటగాళ్లు పోరాట పటిమ చూపించారు. 90+1వ నిమిషంలో నజీబ్ గోల్ చేయగా, 90+4వ నిమిషంలో ఫూజీ మరో గోల్ సాధించాడు. దీంతో స్కోరు 3-2కు చేరి మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. అయినప్పటికీ భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆధిక్యాన్ని కాపాడుకున్నారు. చివరకు 3-2తో విజయం సాధించి సాఫ్ ఛాంపియన్‌షిప్‌లో శుభారంభం చేశారు.

కోహ్లీ బ్యాటింగ్‌కు ఫిదా.. రవిశాస్త్రి ప్రశంసల వర్షం!

గత 7-10 ఏళ్లలో ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటి

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీనే ఆల్‌టైమ్ గ్రేట్

ఇప్పటికీ టెస్టుల్లో రాణించే సత్తా ఉందని వ్యాఖ్య

న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అద్భుత ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్న పిచ్‌పై కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని కేవలం 51 బంతుల్లోనే 74 పరుగులు సాధించాడు. కోహ్లీ ప్రదర్శనపై మాజీ భారత కోచ్ రవిశాస్త్రి ప్రశంసల వర్షం కురిపించాడు.**అద్భుతమైన ఇన్నింగ్స్..** న్యూజిలాండ్ పేసర్లకు సహకరించిన పిచ్‌పై కోహ్లీ చూపిన ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ నైపుణ్యం అద్భుతమని రవిశాస్త్రి కొనియాడాడు. గత ఏడెనిమిది, పదేళ్లలో కోహ్లీ ఆడిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌ల్లో ఇదొకటని అభిప్రాయపడ్డాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి తప్పులు చేయకుండా, ఎంతో సులభంగా బ్యాటింగ్ చేయడం సాధారణ విషయం కాదని పేర్కొన్నాడు. ఇతర బ్యాటర్లకు కష్టంగా అనిపించిన పిచ్‌పై కోహ్లీ మాత్రం తనదైన శైలిలో పరుగులు సాధించాడని ప్రశంసించాడు.**పరిమిత ఓవర్లలో ఆల్‌టైమ్ గ్రేట్..** కోహ్లీ గణాంకాలు, సాధించిన పరుగులు, సెంచరీలు, లక్ష్య ఛేదనలో జట్టును విజయతీరాలకు చేర్చిన తీరు అతడి గొప్పతనానికి నిదర్శనమని శాస్త్రి పేర్కొన్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కోహ్లీని ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడిగా అభివర్ణించాడు. క్రీజులో ఉన్నప్పుడు పరుగుల వేగాన్ని నియంత్రిస్తూ, అవసరమైన సమయంలో దూకుడు పెంచడం అతడి ప్రత్యేకత అని తెలిపాడు.**టెస్టుల్లోనూ ఆడగలడు..** విరాట్ కోహ్లీకి ఇప్పటికీ టెస్టు క్రికెట్‌లో రాణించే సామర్థ్యం ఉందని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. అతడి ఫిట్‌నెస్ స్థాయిలు అత్యుత్తమంగా ఉన్నాయని, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆటపై అంకితభావం చూస్తే టెస్టుల్లోనూ సత్తా చాటగలడని అభిప్రాయపడ్డాడు. కోహ్లీని మళ్లీ టెస్టు క్రికెట్‌లో చూడాలని పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు కోరుకుంటున్నారని పేర్కొన్నాడు.



రికార్డుల రారాజు రొనాల్డో రిటైర్మెంట్!

23 ఏళ్ల అంతర్జాతీయ ఫుట్‌బాల్ ప్రయాణానికి ముగింపు..

పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు, 146 గోల్స్

ఫుట్‌బాల్ ప్రపంచాన్ని తన ఆటతీరుతో ఉర్రూతలూగించిన పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు. 23 ఏళ్లపాటు పోర్చుగల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయన తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు ప్రకటించాడు. ఈ సందర్భంగా తన జాతీయ జట్టు ఏడో నంబర్ జెర్సీని భవిష్యత్తు తరానికి అందించాల్సిన సమయం వచ్చిందని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు.**రికార్డులే చిరునామాగా..** రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌లో ఎన్నో అరుదైన రికార్డులు సృష్టించాడు. పోర్చుగల్ తరఫున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. నాలుగు యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలను అందుకున్నాడు. కెరీర్‌లో 1,300కు పైగా మ్యాచ్‌లు ఆడిన ఘనత సాధించాడు.**పోర్చుగల్‌కు చిరస్మరణీయ విజయాలు..** 2016లో పోర్చుగల్ యూరో కప్ గెలవడంలో రొనాల్డో కీలక పాత్ర పోషించాడు. 2019, 2025లో నేషన్స్ లీగ్ టైటిళ్లు సాధించిన జట్టులోనూ భాగమయ్యాడు. ఆరు ప్రపంచకప్‌లలో ఆడిన అరుదైన ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. ప్రపంచకప్ సాధించాలన్న కల నెరవేరకపోయినా, దేశం తరఫున ఆడినందుకు జీవితాంతం గర్వపడతానని తన వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు.**క్లబ్ ఫుట్‌బాల్‌లో కొనసాగింపు..** అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినప్పటికీ రొనాల్డో ఫుట్‌బాల్‌కు పూర్తిగా దూరం కావడం లేదు. సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తరఫున కొనసాగనున్నాడు. పోర్చుగల్ జట్టుకు అందించిన సేవలు, సాధించిన రికార్డులు ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.



రెండో వన్డేలో నితీశ్‌కు చోటు అవసరం లేదు!

- **రహానే కీలక వ్యాఖ్యలు..**

ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలని సూచన



న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా వరుస విజయాలపై దృష్టి సారించింది. తొలి వన్డేలో విజయం సాధించిన భారత జట్టు రెండో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో తుది జట్టు కూర్పుపై చర్చ మొదలైంది. ముఖ్యంగా తెలుగు యువ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డికి రెండో వన్డేలోనైనా అవకాశం దక్కుతుందా? లేదా? అన్న ఆసక్తి నెలకొంది.ఈ అంశంపై మాజీ భారత క్రికెటర్ అజింక్య రహానే స్పందించాడు. ప్రస్తుత భారత జట్టు కూర్పును పరిశీలిస్తే నితీశ్ కుమార్ రెడ్డిని రెండో వన్డేలో ఆడించాల్సిన అవసరం కనిపించడం లేదని అభిప్రాయపడ్డాడు. నితీశ్ జట్టులో ఉన్నా, లేకపోయినా పెద్దగా తేడా ఉండదని పేర్కొన్నాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లతోనే సమతూకమైన కూర్పు ఉందని రహానే వ్యాఖ్యానించినట్లు సమాచారం.**ఆకిబ్ నబీకి మరో అవకాశం ఇవ్వాలి..** తొలి వన్డేలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన యువ పేసర్ ఆకిబ్ నబీకి మాత్రం మరో అవకాశం ఇవ్వాలని రహానే సూచించాడు. తొలి మ్యాచ్‌లో నబీ ఆరు ఓవర్లు బౌలింగ్ చేసి 33 పరుగులు ఇచ్చినా వికెట్ సాధించలేకపోయాడు. అయినప్పటికీ అతడి ప్రతిభను నిరూపించుకునేందుకు మరో మ్యాచ్‌లో అవకాశం కల్పించాలని అభిప్రాయపడ్డాడు.యువ ఆటగాళ్లకు వరుసగా అవకాశాలు ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రహానే పేర్కొన్నాడు. ఒక మ్యాచ్‌లో వికెట్లు తీయలేదని వెంటనే పక్కన పెట్టకుండా, మరోసారి తమ సత్తా చాటుకునే అవకాశం ఇవ్వాలని సూచించాడు. ఈ విషయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయం కీలకం కానుంది.**తొలి మ్యాచ్‌లో భారత్ విజయం..** ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ విజయంతో ప్రారంభించింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్‌ను 185 పరుగులకే ఆలౌట్ చేసింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని 143 పరుగులకు కుదించగా, 22.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సమిష్టి ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.ఇప్పుడు వెల్లింగ్‌టన్ వేదికగా జరిగే రెండో వన్డేపై భారత జట్టు దృష్టి సారించింది. తొలి మ్యాచ్‌లో సాధించిన విజయోత్సాహంతో బరిలోకి దిగనున్న గిల్ సేన.. మరో గెలుపుతో సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. నితీశ్‌కు అవకాశం కల్పిస్తారా? ఆకిబ్ నబీని కొనసాగిస్తారా? అన్నది జట్టు ఎంపికలో ఆసక్తికరంగా మారింది.

రంజీ ట్రోఫీలో త్రిపుర సంచలనం..

సౌరాష్ట్రపై ఘన విజయం!

- 133 పరుగుల తేడాతో గెలుపు..

సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు



అగర్తలా: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో త్రిపుర జట్టు సంచలనం సృష్టించింది. రెండుసార్లు రంజీ ట్రోఫీ విజేతగా నిలిచిన సౌరాష్ట్రను 133 పరుగుల తేడాతో ఓడించింది. గురువారం ముగిసిన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో త్రిపుర ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 268 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన సౌరాష్ట్ర కేవలం 118 పరుగులకే కుప్పకూలింది. దీంతో త్రిపురకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో త్రిపుర 191 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్ర ముందు 342 పరుగుల లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్ అర్పిత్ వాసవడ 189 బంతుల్లో 89 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేశాడు. అయితే మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లభించకపోవడంతో జట్టు ఓటమి పాలైంది.**బౌలర్ల విజృంభణ..** త్రిపుర బౌలర్లు సందీప్ సర్కార్, అభిజిత్ సర్కార్ కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. సందీప్ సర్కార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు సాధించగా, అభిజిత్ సర్కార్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో సందీప్ నాలుగు, అభిజిత్ మూడు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో నాలుగు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు సాధించిన త్రిపుర పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి చేరుకుంది.

సీఎస్‌కే, ఎస్ఆర్‌హెచ్ మధ్య నలుగురు ఆటగాళ్ల మార్పిడి!

- **ఐపీఎల్-2027కు ముందే కీలక ట్రేడ్.. చెన్నైకి లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్**
- **హైదరాబాద్ జట్టులోకి ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్**



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్లు కీలక మార్పులు చేపట్టాయి. రెండు ఫ్రాంచైజీలు నలుగురు ఆటగాళ్లను పరస్పరం మార్చుకుంటూ ట్రేడ్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్, ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ చెన్నై జట్టులోకి వెళ్లగా.. భారత పేసర్ ఖలీల్ అహ్మద్, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ హైదరాబాద్ జట్టులో చేరనున్నారు.**చెన్నైకి ఇద్దరు ఆల్‌రౌండర్లు..** లివింగ్‌స్టోన్ గతంలో హైదరాబాద్ జట్టు రూ.13 కోట్లకు కొనుగోలు చేయగా, తాజా ఒప్పందంలో రూ.6 కోట్లకే చెన్నైకి బదిలీ అయ్యాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ రూ.3 కోట్ల పాత ధరతోనే సీఎస్‌కేలో చేరనున్నాడు. గాయంతో గత సీజన్‌లో ఎడ్వర్డ్స్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. లివింగ్‌స్టోన్ కూడా రెండు మ్యాచ్‌లకే పరిమితమయ్యాడు.**హైదరాబాద్‌కు పేసర్ల బలం..** భారత ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్ల ధరతో తిరిగి సన్‌రైజర్స్‌లోకి వస్తున్నాడు. గతంలో 2018 నుంచి 2021 వరకు హైదరాబాద్ తరఫున ఆడిన ఖలీల్.. ఐపీఎల్-2025లో చెన్నై తరఫున 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో గాయంతో ఐదు మ్యాచ్‌లకే దూరమయ్యాడు. మరోవైపు ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్ల ధరతో ఎస్ఆర్‌హెచ్‌లో చేరనున్నాడు. డెత్ ఓవర్లలో వైవిధ్యమైన బౌలింగ్‌తో రాణించే ఎల్లిస్ రాకతో హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.**డిసెంబర్ 16న వేలం..** ఐపీఎల్-2027కు సంబంధించిన ఆటగాళ్ల మినీ వేలం డిసెంబర్ 16న గోవాలో జరగనుంది. ఆటగాళ్ల రిటెన్షన్, విడుదలకు నవంబర్ 17 వరకు గడువు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు ట్రేడ్‌లు, ఆటగాళ్ల మార్పిడిపై దృష్టి సారిస్తున్నాయి.

ఓటీటీలోకి 'జైలర్-2'.. నవంబర్ 12 నుంచి సందడి!



ఐదు భాషల్లో స్ట్రీమింగ్.. రజనీకాంత్ అభిమానులకు శుభవార్త

హైదరాబాద్: సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు శుభవార్త. ఆయన నటించిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్-2' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో నవంబర్ 12 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. గురువారం ప్రైమ్ వీడియో సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. **భారీ తారాగణంతో..**నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో అలరించారు. మోహన్‌లాల్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి ప్రత్యేక పాత్రల్లో కనిపించగా.. శివరాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు.**రికార్డు స్థాయి వసూళ్లు..**థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి తమిళ చిత్ర పరిశ్రమలో రికార్డులు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.820 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. థియేటర్లలో విజయవంతమైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోనూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

తెలుగు రాష్ట్రాల్లో 'రామాయణ'కు రూ.100 కోట్ల టార్గెట్!



రూ.54 కోట్లకు థియేట్రికల్ హక్కుల విక్రయం.. బ్రేక్ ఈవెన్ సాధ్యమేనా?

హైదరాబాద్: భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన పౌరాణిక చిత్రం 'రామాయణ' తెలుగు రాష్ట్రాల్లో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర చర్చకు తెరలేపింది. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటించారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.**రూ.54 కోట్లకు హక్కుల విక్రయం..**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాత, పంపిణీదారు దిల్ రాజు సుమారు రూ.54 కోట్లకు దక్కించుకున్నట్లు ట్రేడ్ వర్గాల అంచనా. ఈ పెట్టుబడిని వెనక్కి రాబట్టి బ్రేక్ ఈవెన్ సాధించాలంటే తెలుగు రాష్ట్రాల్లో సినిమా దాదాపు రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఒక హిందీ డబ్బింగ్ చిత్రానికి తెలుగు మార్కెట్‌లో ఇంత భారీ లక్ష్యాన్ని నిర్దేశించడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.**యశ్ క్రేజ్‌పై భారీ ఆశలు..**ఈ సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో యశ్ క్రేజ్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 'కేజీఎఫ్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన యశ్ రావణుడి పాత్రలో కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి నటనతో పాటు భారీ విజువల్ ఎఫెక్ట్స్, యుద్ధ సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటాయన్నది కీలకంగా మారింది. రామాయణ గాథతో తెలుగు ప్రేక్షకులకు ఉన్న అనుబంధం కూడా సినిమాకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు.**అడ్వాన్స్ బుకింగ్స్‌పై దృష్టి..**తెలుగు రాష్ట్రాల్లో ముందస్తు టికెట్ బుకింగ్స్ ద్వారా సుమారు రూ.6 కోట్ల వసూళ్లు నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందన, మౌత్ టాక్ వసూళ్లపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా తొలి వారాంతంలో వచ్చే కలెక్షన్లు రూ.100 కోట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా కీలకం కానున్నాయి.**దిల్ రాజుకు కీలక పరీక్ష..**భారీ ధరకు హక్కులు సొంతం చేసుకున్న దిల్ రాజుకు ఈ సినిమా వసూళ్లు కీలకంగా మారాయి. ప్రేక్షకుల ఆదరణతోనే పెట్టుబడి వెనక్కి వచ్చే అవకాశం ఉంటుంది. భారీ అంచనాలు, స్టార్ నటీనటులు, ఇతిహాస కథాంశం సినిమాకు బలంగా ఉన్నప్పటికీ.. తెలుగు రాష్ట్రాల్లో రూ.100 కోట్ల గ్రాస్ సాధించడం ఎంతవరకు సాధ్యమవుతుందో చూడాలి.

కుటుంబ భావోద్వేగాలు.. మధురమైన సంగీతంతో 'మాయలేడి'!

నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల.. రాకేష్ వర్రే, మధుమిత సర్కార్ జంటగా నటించిన చిత్రం



హైదరాబాద్: యంగ్ హీరో, నిర్మాత రాకేష్ వర్రే నటిస్తూ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మాయలేడి' విడుదలకు సిద్ధమైంది. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. మధుమిత సర్కార్ కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు.**ప్రేమలోని భావోద్వేగాలే కథాంశం..**దర్శకుడు ప్రశంకర్ మాట్లాడుతూ.. ప్రేమ సంబంధాల్లో ఎదురయ్యే అనేక భావోద్వేగాలను సినిమాలో చూపించామని తెలిపారు. క్రిష్ అనే యువకుడు తన ప్రేయసిలోని విభిన్నమైన భావాలను ఎలా ఎదుర్కొన్నాడన్నది ఆసక్తికరంగా తెరకెక్కించామని చెప్పారు. మంచి సంగీతం, వినోదంతో పాటు చిన్న సందేశం కూడా సినిమాలో ఉంటుందని వెల్లడించారు.

కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా..హీరో, నిర్మాత రాకేష్ వర్రే మాట్లాడుతూ.. 'మన్మథుడు', 'నువ్వు నాకు నచ్చావ్', 'నిన్నే పెళ్లాడతా' వంటి చిత్రాల తరహాలో కుటుంబ అంశాలు, సంగీతానికి ప్రాధాన్యమిస్తూ 'మాయలేడి'ని రూపొందించామని తెలిపారు. 'ఖుషి' తరహా ప్రేమకథను తెరపై చూసి చాలా కాలమైందని, వరుసగా యాక్షన్ చిత్రాలు వస్తున్న తరుణంలో తమ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ మధుమిత సర్కార్, మధురిమ, అంజి, భార్గవ నౌండ్ల తదితరులు పాల్గొన్నారు.

సూర్యతో నజ్రియా.. 'సీన్'తో లీఎంట్రీ!



హైదరాబాద్: ప్రముఖ నటి నజ్రియా నజీమ్ కొంతకాలం విరామం తర్వాత తమిళ చిత్ర పరిశ్రమలోకి తిరిగి వస్తున్నారు. సూర్య హీరోగా నటిస్తున్న 'సీన్' చిత్రంలో కథానాయికగా కనిపించనున్నారు. జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నజ్రియా 'మాయ' పాత్ర పోషిస్తున్నారు. నవంబర్ 6న దీపావళి సందర్భంగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. సూర్యతో నజ్రియా తొలిసారి జోడీ కడుతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

తెలుగు, దక్షిణాది సినిమాలపై రాధికా ఆప్టే తీవ్ర విమర్శలు!

హీరోయిన్ల ఎంపికపై అభ్యంతరాలు.. హీరోల వయసు, కథల్లోని సంప్రదాయాలపైనా వ్యాఖ్యలు



హైదరాబాద్: నటి రాధికా ఆప్టే తెలుగు, దక్షిణాది చిత్ర పరిశ్రమలపై చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన తాజా వెబ్‌సిరీస్ 'అక్క' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆమె దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల ఎంపిక, కథాంశాలు, నటీనటుల పాత్రలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.**హీరోతో రొమాన్స్ చేయడం ఇబ్బందిగా అనిపించింది..**దాదాపు 12 ఏళ్ల క్రితం తెలుగులో నటించిన ఓ ప్రముఖ హీరో చిత్రంలో తనకంటే చాలా పెద్ద వయసున్న నటుడితో రొమాన్స్ చేయాల్సి వచ్చిందని రాధికా ఆప్టే తెలిపారు. ఆ సినిమాలోని కొన్ని సన్నివేశాలు తనకు అసౌకర్యంగా అనిపించాయని చెప్పారు.

స్మార్ట్‌గా చేయాలనుకుంటే.. కామెడీ అయిపోతుంది!

- 'దొంగ నా కొడుకు'తో హీరోయిన్‌గా పరిచయమవుతున్న సుష్మితా శెట్టి



హైదరాబాద్: తాను ఏదైనా స్మార్ట్‌గా చేయాలనుకుంటే అది చివరకు కామెడీగా మారిపోతుందని 'దొంగ నా కొడుకు' చిత్ర హీరోయిన్ సుష్మితా శెట్టి సరదాగా వ్యాఖ్యానించారు. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, శ్రీను కంబాల దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు.ఈ సినిమాలో తాను చాలా చలాకీగా, కొంచెం తింగరిగా ప్రవర్తించే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని సుష్మిత తెలిపారు. హీరో ఈశ్వర్‌ను గాఢంగా ప్రేమించే యువతిగా, ప్రేమ కోసం ఏమైనా చేసే స్వభావంతో తన పాత్ర ఉంటుందని చెప్పారు. తెలియకుండానే కొన్ని నేరాల్లో అమాయకంగా ఇరుక్కుంటూ ఉంటానని వెల్లడించారు. సినిమా చూసిన ప్రేక్షకులు నవ్వుకుంటూ థియేటర్ల నుంచి బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.**శ్రీదేవి స్ఫూర్తితో నటనలోకి..**'దొంగ నా కొడుకు' తనకు కథానాయికగా తొలి చిత్రమని, గతంలో 'జగమే సంగీతం' వెబ్‌సిరీస్‌లో నటించానని తెలిపారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన తాను విదేశాల్లో చదువుకున్నానని, అక్కడ థియేటర్ కూడా చేశానని చెప్పారు. చిన్నప్పటి నుంచి నృత్యంపై ఆసక్తితో అన్ని రకాల నృత్యాలు నేర్చుకున్నానని, వాటి ద్వారానే నటనపై ఆసక్తి పెరిగిందని వివరించారు. నటి శ్రీదేవి తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు.**విభిన్న పాత్రలు చేయాలని ఉంది..**'మహానటి' తనకు ఇష్టమైన చిత్రమని, అందులోని అన్ని రకాల భావోద్వేగాలతో కూడిన పాత్ర చేయాలని ఉందని సుష్మిత తెలిపారు. క్రీడా నేపథ్య చిత్రాల్లోనూ నటించాలని ఉందన్నారు.